

నెత్తిన బెల్లంతో అమ్మవార్ల దర్శనానికి వస్తున్న మంత్రులు పొన్నం, సీతక్క, ఆర్టీసీ ఎండీ సజ్జనార్

# జాతరకు 6వేల బస్సులు

- సమాయత్తమైన టీఎస్ ఆర్టీసీ
- భక్తులకు ఇబ్బందులు రానివ్వం
- మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క
- ఆర్టీసీ ఉన్నతాధికారులతో కలిసి ఏర్పాట్ల పరిశీలన
- ఏసీ బస్సుల ప్రారంభం

తాడ్వాయి, ఫిబ్రవరి 5 : ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన మేడారానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం టీఎస్ ఆర్టీసీ 6 వేల బస్సులు నడుపనున్నట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క తెలిపారు. సోమవారం వారు తాడ్వాయి మండలకేంద్రంలో పాటు మేడారంలో ఆర్టీసీ బస్టాండ్ పనులను ఎండీ సజ్జనార్‌తో కలిసి పరిశీలించారు. సిబ్బంది విశ్రాంతి తీసుకునేందుకు ఏర్పాటుచేసిన తడకల షెడ్లను పరిశీలించారు. అలాగే క్యూలైన్లు, టికెట్ కౌంటర్లు, టికెట్ ఇష్యూ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వనదేవతల దర్శనానికి వెళ్లగా పూజారులు, దేవాదాయ శాఖ అధికారులు మంత్రులకు ఘన స్వాగతం పలికారు. ఎత్తు బంగారంతో గద్దెల వద్దకు చేరుకొని మొక్కులు చెల్లించారు. అనంతరం మేడారంలోని హరిత హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రులు మాట్లాడారు. మహాజాతర సందర్భంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 6వేల బస్సుల ద్వారా భక్తులను మేడారానికి చేర్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అందుబాటులో ఉన్నందున ఆమేరకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 14.50 కోట్ల మంది ఉచిత ప్రయాణం చేయగా వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చుతున్న ఆర్టీసీ సిబ్బందిని మంత్రులు అభినందించారు.

ఆర్టీసీ ఎండీ సజ్జనార్ మాట్లాడుతూ జాతరను ఆర్టీసీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నారమన్నారు. 30లక్షల మంది భక్తులు ఆర్టీసీలో ప్రయాణిస్తారని అంచనా వేస్తున్నామని, రద్దీకి అనుగుణంగా బస్సులను అందుబాటులో ఉంచుతామని చెప్పారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల నుంచి జాతరకు భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని, ఈమేరకు జిల్లాలో 51 ట్రాఫిక్ జనరేటింగ్ పాయింట్లను గుర్తించామన్నారు. ట్రాఫిక్ జనరేటింగ్ పాయింట్లలో భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఈనెల 16 నుంచి మేడారంలో బేస్ క్యాంపును ప్రారంభిస్తామన్నారు. 14వేల మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తార ని, వారికి వసతి, భోజన విషయంలో ప్రత్యేక చర్యలు చేపట్టామని సజ్జనార్ తెలిపారు. అనంతరం ఏసీ లహరి బస్సులను మంత్రులు ప్రారంభించారు.

## పథకాలపై మంత్రుల చర్చ

ములుగు, ఫిబ్రవరి 5(నమస్తే తెలంగాణ) : మహా జాతర అభివృద్ధి పనులను పరిశీలించేందుకు మంత్రులు సీతక్క, పొన్నం సోమవారం మేడారం వెళ్లారు. హైదరాబాద్ నుంచి కారులో వెళ్తున్న వారు ప్రభుత్వ పథకాలతో పాటు మేడారం లో కల్పించిన సౌకర్యాలు, తెలంగాణ సాధనలో జరిగిన సంఘటనలపై ముచ్చటిస్తూ 12 నిమిషాల నిడివితో ప్రత్యేక వీడియోను తీశారు. దీనిని సోషల్ మీడియా, ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చే యగా వైరల్ అయింది. కొందరు జేజేలు కొడితే మరికొందరు నెటిజన్లు మేడారంలో సౌకర్యాలు మెరుగుపర్చాలని, ఆర్టీసీ కార్మికుల బాధలకు విముక్తి కల్పించాలని, భక్తులకు సౌకర్యాలు కల్పించడం లేదంటూ అసంతృప్తి వ్యక్తంచేస్తూ కామెంట్లు పెట్టారు. కాగా, ఆర్టీసీ, ఇతర శాఖల ద్వారా మేడారం భక్తులకు తల్లుల ప్రసాదం(బెల్లం) పంపిణీ చేయాలని మంత్రులు చర్చించుకున్నారు.

## గట్టమ్మను దర్శించుకున్న మంత్రులు

ములుగు రూరల్, ఫిబ్రవరి 5 : గట్టమ్మ దేవాలయాన్ని మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ సందర్శించారు. పూజారి కొత్త సదయ్య గట్టమ్మ ఆశీస్సులను మంత్రులకు అందించారు. ఈ నెల 14న నిర్వహించనున్న ఎదురుపిల్ల పండుగ వాల్‌పోస్టర్లను మంత్రులతో ఆదివాసీ నాయకపోడ్ గట్టమ్మ పూజారులు ఆవిష్కరింపజేశారు. ఇంచర్ల సమీపంలోని ఎర్రి గట్టమ్మను సైతం మంత్రులు దర్శించుకొని మేడారానికి తరలివెళ్లారు. అలాగే ఆర్టీసీ ప్రయాణికుల కోసం గట్టమ్మ వద్ద చేస్తున్న ఏర్పాట్లను ఎండీ సజ్జనార్ ఎస్పీ శబరీష్‌తో కలిసి పరిశీలించారు. గట్టమ్మకు పూజలు చేసిన ఆయన బస్సుల రాకపోకలపై ఎస్పీతో చర్చించారు. వారి వెంట కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీజ, డీఎస్పీ రవీందర్, సీఐ రంజిత్‌కుమార్, ఎస్సై వెంకటేశ్వర్, గట్టమ్మ పూజారులు కొత్త సదయ్య, లక్ష్మయ్య, సురేందర్, రాజేశ్, చిర్ర రాజేందర్, అరిగెల సుమతి, సరోజన, నిర్మల ఉన్నారు.

## నేడు అయోధ్యకు ప్రత్యేక రైలు ప్రారంభం



కాజీపేట, ఫిబ్రవరి 5 : అయోధ్య బాల రాముడి దర్శనానికి వెళ్లే భక్తుల కోసం మంగళవారం కాజీపేట నుంచి ఆస్తా ప్రత్యేక రైలును ప్రారంభిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. కాజీపేట నుంచి సాయంత్రం 6:20 గంటలకు ఈ రైలు బయలుదేరనున్నది. గత నెల 30న బయలు దేరాల్సిన ఆస్తా ప్రత్యేక రైలును సాంకేతిక కారణాలతో రద్దు చేశారు. మళ్లీ ఈ రైలును పాత ప్రత్యేక రైళ్ల షెడ్యూల్ ప్రకారం నడిపిస్తున్నట్లు అధికారులు తెలిపారు. భక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.



### గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఓటర్ల ఏర్పాట్లు ఇలా

- ఓటర్ల నమోదు ప్రకటన : డిసెంబర్ 30 (2023)
- దరఖాస్తుకు తుది గడువు : ఫిబ్రవరి 6
- ముసాయిదా ఓటర్ల జాబితా : ఫిబ్రవరి 24
- అభ్యంతరాలను, ఫిర్యాదుల స్వీకరణ : ఫిబ్రవరి 24 నుంచి మార్చి 14 వరకు
- అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారం పూర్తి : మార్చి 29లోపు
- తుది ఓటర్ల జాబితా ప్రకటన : ఏప్రిల్ 4

### 2021లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో గ్రాడ్యుయేట్ ఓటర్లు

| జిల్లా | ఓటర్లు |
|---|---|
| వరంగల్ అర్బన్ | 64,432 |
| వరంగల్ రూరల్ | 32,835 |
| మహబూబాబాద్ | 35,389 |
| జనగామ | 20,502 |
| జయశంకర్ భూపాలపల్లి | 12,388 |
| ములుగు | 9890 |
| సిద్దిపేట | 3,395 |

# ఇయ్యాల ఆఖరు

## ఓటరు దరఖాస్తుకు గడువు

- గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నిక
- ఏప్రిల్ 4న తుది జాబితా
- గత ఎన్నికల కంటే తక్కువ నమోదు!

వరంగల్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఓటర్ల నమోదు ప్రక్రియ మంగళవారంతో ముగియనున్నది. చివరి రోజు కావడంతో ఎక్కువ మంది దరఖాస్తు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రాడ్యుయేట్లు స్వయంగా ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్న వారు ప్రత్యేకంగా కేంద్రాలను పెట్టి ఈ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. 2023 డిసెంబర్ 30 నుంచి ఓటర్ల నమోదు ప్రక్రియ మొదలైంది. 2023 నవంబర్ 1 నాటికి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి మూడేండ్లు గడిచిన వారు ఈ ఎన్నికలో ఓటు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. ఇప్పటివరకు 3.50 లక్షల మంది ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. పరిశీలన అనంతరం తుది ఓటర్ల జాబితా వెల్లడించనున్నారు.

వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి 2021లో జరిగిన సాధారణ ఎన్నికలో 4,91,396 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 3,23,377 మంది పురుషులు.. 1,67,947 మంది మహిళలు. గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీగా ఉన్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇటీవలి ఎన్నికల్లో జనగామ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. ఈ స్థానానికి ఇప్పుడు ఉప ఎన్నిక నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నిక కోసం ఓటర్లు ప్రతిసారి నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. సాధారణ ఎన్నికతో పోల్చితే ఉప ఎన్నికలో ఓటర్ల సంఖ్య ప్రస్తుతానికి తక్కువగానే ఉన్నది. ప్రతిసారి నమోదు చేసుకోవడం దీనికి కారణంగా కనిపిస్తున్నది.




**12 జిల్లాల పరిధి..**

వరంగల్-ఖమ్మం-నల్లగొండ గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గ పరిధి 12 జిల్లాల్లో ఉన్నది. వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సిద్దిపేట జిల్లాల్లోని గ్రాడ్యుయేట్లు ఓటర్లుగా ఉంటారు. సిద్దిపేట, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, హనుమకొండ జిల్లాల్లో కొన్ని మండలాలు ఈ సెగ్మెంట్‌లోకి రావు. వరంగల్ జిల్లాల నుంచి సిద్దిపేట జిల్లాలో చేరిన కొమురవెల్లి, మద్దూరు, ధూల్మిట్ట, చేర్యాల.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలో భూపాలపల్లి, చిట్యాల, టేకుమట్ల, రేగొండ, గణపురం, మొగుళ్లపల్లి, గోరుకొత్తపల్లి మండలాలు ఈ గ్రాడ్యుయేట్ నియోజకవర్గ పరిధిలోనే ఉన్నాయి. ములుగు మండలంలో వెంకటాపూర్(నూగూరు), వాజేడు.. మహబూబాబాద్ జిల్లాలో గార్ల, బయ్యారం మండలాలు.. హనుమకొండ జిల్లాలో ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, కమలాపూర్ మండలాలు ఎన్నిక జరిగే నియోజకవర్గ పరిధిలో ఉండవు.

**గులాబీ జెండానే..**

వరంగల్-ఖమ్మం-నల్లగొండ గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గంలో ప్రతిసారి బీఆర్ఎస్(టీఆర్ఎస్) పార్టీ అభ్యర్థి గెలిచారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాసనమండలి ఏర్పాటు చేసేందుకు 2007లో మొదటిసారి గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నిక జరిగింది. టీఆర్ఎస్ అభ్యర్థి కపిలవాయి దిలీప్‌కుమార్ ఈ ఎన్నికలో విజయం సాధించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం టీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రాజీనామా చేశారు. వరంగల్-ఖమ్మం-నల్లగొండ గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గానికి 2009లో జరిగిన ఉప ఎన్నికలోనూ టీఆర్ఎస్ కపిలవాయి దిలీప్‌కుమార్ రెండోసారి గెలిచారు. 2015, 2021లో ఈ నియోజకవర్గానికి జరిగిన సాధారణ ఎన్నికల్లోనూ టీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం సాధించారు.

# వరంగల్‌కు టెక్నికల్ సెంటర్

- రూ. 200 కోట్లతో ఏర్పాటుకు నిర్ణయం
- రాష్ట్ర మంత్రివర్గాన్ని ఒప్పించిన కొండా సురేఖ

వరంగల్, ఫిబ్రవరి 5 (నమస్తేతెలంగాణ): వరంగల్ జిల్లాలో టెక్నికల్ సెంటర్ ఏర్పాటు కోసం రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేసిన ప్రయత్నాలు ఫలించాయి. వరంగల్ రంగశాయిపేటలో టెక్నికల్ సెంటర్(హబ్)కు రాష్ట్ర మంత్రి మండలి అంగీకారం తెలిపింది. ఈ టెక్నికల్ సెంటర్ నిర్వహణ కోసం భవన నిర్మాణం, ప్లాంట్, యంత్రాలను సమకూర్చేందుకు కేంద్ర ప్రభుత్వం రూ. 200 కోట్లు పెట్టుబడిగా పెట్టనుంది. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 20 టెక్నికల్ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించింది. వీటిలో ఒకటి తెలంగాణలో ఏర్పాటు కాబోతున్నది. అది వరంగల్‌లోని రంగశాయిపేటలో ఏర్పాటు చేయడానికి మంత్రి కొండా సురేఖ చేసిన ప్రయత్నాలు సఫలీకృతమయ్యాయి. ఈ సెంటర్‌ను విశేషమైన సామర్థ్యంతో నిర్మించేందుకు కేంద్రం సంకల్పించింది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు అధునాతన సాంకేతికతను సమకూర్చడం, నైపుణ్యం కలిగిన మానవ వనరుల సృష్టి, సాంకేతిక నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక, వ్యాపార సలహాలు అందించడం వంటి అంశాల్లో ఈ టెక్నికల్ సెంటర్ ప్రభావంతమైన పాత్ర పోషించనుంది. పలు రకాల పరిశ్రమలకు అవసరమైన సేవలను అనుసరించి ఇది శిక్షణా కార్యక్రమాలను చేపట్టనుంది. నిర్మాణ, ఎలక్ట్రికల్, ఫౌండ్రీ, లెదర్, గ్లాస్, స్పోర్ట్స్ వంటి వివిధ రంగాలకు టెక్నికల్ సెంటర్ సేవలను అందించనుంది. రాష్ట్రంలో ఇదే తొలి టెక్నికల్ సెంటర్ కానుంది. దీంతో ఈ సెంటర్ వరంగల్ జిల్లాలో మైలురాయిగా నిలవనుంది. వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించే టెక్నికల్ సెంటర్ వరంగల్‌లో ఏర్పాటు కానుండడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. పట్టుదలతో వరంగల్‌లో టెక్నికల్ సెంటర్ స్థాపన కోసం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించారని మంత్రి కొండా సురేఖకు అభినందనలు తెలిపారు.



మంత్రి కొండా సురేఖ

# మిర్చి @ 30,918 బస్తాలు

- ఎర్రబంగారంతో ఎనుమాముల మార్కెట్ కళకళ
- ఈ సీజన్‌లోనే ఇదే అత్యధికం
- నిలకడగానే మిర్చి ధరలు
- వ్యాపారులు, వివిధ కార్మికుల హర్షం



సోమవారం మార్కెట్‌కు భారీగా వచ్చిన మిర్చి బస్తాలు

కాశీబుగ్గ, ఫిబ్రవరి 5 : వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలోని మిర్చి యార్డుకు సోమవారం రికార్డు స్థాయిలో 30,918 మిర్చి బస్తాలు వచ్చాయి. ఈ సీజన్ డిసెంబర్ నుంచి ప్రారంభం కాగా సోమవారం అత్యధికంగా మిర్చి బస్తాలు రావడంతో మార్కెట్‌లో ఎటుచూసినా ఎర్రబంగారం బస్తాలతో కళకళలాడింది. సీజన్ ప్రారంభంలో నామమాత్రంగా రోజుకు రెండు వేల నుంచి 10వేల బస్తాల వరకు వచ్చేవి. సంక్రాంతి పండుగ తర్వాత మార్కెట్‌కు మిర్చి బస్తాల రాక పెరిగింది. జనవరి 19న అత్యధికంగా 25వేల బస్తాలు వచ్చాయి. సోమవారం 30,918 లకు పైగా మిర్చి బస్తాలు మార్కెట్‌కు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ధరలు మాత్రం ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా నిలకడగానే ఉంటున్నట్లు వ్యాపారులు తెలిపారు. మిర్చి రాక పెరగడంతో అడ్తి, ఖరీదు వ్యాపారులతో పాటు దడువాయి, గుమాస్తా, హమాలీ, ఇతర కార్మిక వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమకు చేతి నిండా పని దొరుకుతుందని కార్మికులు సంబురపడుతున్నారు. ఇప్పటివరకు మార్కెట్‌కు లక్షా 81వేల క్వింటాళ్ల మిర్చి వచ్చినట్లు మార్కెట్ వర్గాలు తెలిపారు. వీటిలో తేజ రకం అత్యధికంగా క్వింటాల్‌కు రూ.21,100, కనిష్టంగా రూ.14,500, వండర్ హాట్ అత్యధికంగా రూ.20,500, కనిష్టంగా 14,500, యుఎస్-341 రూ.20వేలు, కనిష్టంగా 14వేలు, తాలు రకం మిర్చి రూ.8500, కనిష్టంగా రూ.5వేలు ధరలు పలికినట్లు మార్కెట్ వర్గాలు తెలిపారు.

## ఎనుమాముల మార్కెట్‌లో రికార్డుల తనిఖీ

కాశీబుగ్గ, ఫిబ్రవరి 5: ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో రికార్డులను రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ డైరెక్టర్లు లక్ష్మణుడు, రవికుమార్‌తోపాటు జేడీఎం ఎన్నారపు మల్లేశం, డీడీఎం అజ్మీరా రాజునాయక్, డీఎంవో పాలకుర్తి ప్రసాద్‌రావు, కార్యదర్శి క్యారం సంగయ్య సమావేశమయ్యారు. మార్కెట్ పరిధిలో జరుగుతున్న క్రయవిక్రయాల తీరు, రైతుల సమస్యలు, అడ్తి, ఖరీదు లైసెన్స్‌ల రెన్యువల్స్, పేమెంట్స్, సిబ్బంది పని తీరుపై చర్చించారు. రైతులకు మెరుగైన సేవలు అందిస్తూ ఇబ్బందులు కలుగకుండా విధులు నిర్వర్తించాలని సిబ్బందిని ఆదేశించారు.

## బాలికపై లైంగికదాడి కేసులో నిందితుడికి 20 సంవత్సరాల జైలు

వరంగల్ లీగల్, ఫిబవరి 5 : పదో తరగతి చదువుతున్న బాలికపై లైంగికదాడి చేసిన నిందితుడు మినుముల అఖిల్‌కు 20 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.4 లక్షల జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి అపర్ణాదేవి సోమవారం తీర్పు వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. ఐనవోలు మండలానికి చెందిన బాలికకు మాయమాటలు చెప్పి ఏప్రిల్ 10, 2019న వర్ధన్నపేట శివారు అంబేద్కర్ నగర్‌కు చెందిన మినుముల అఖిల్ వ్యవసాయ భూముల్లోకి తీసుకెళ్లి లైంగికదాడి చేశాడు. బాలిక ఫిర్యాదుతో అప్పటి సీఐ శ్యాంసుందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడిని గుర్తించి సాక్ష్యాలను సేకరించి చార్జిషీటు దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువైనందున జడ్జి నిందితుడికి జైలు శిక్షతో పాటు జరిమానా విధించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజ మల్లారెడ్డి వాదించగా, లైసన్ ఆఫీసర్ పరమేశ్వరి, భరోసా సెంటర్ ప్రతినిధి నీలిమ, కోర్టు డ్యూటీ కానిస్టేబుల్ సీహెచ్ రాజు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు.

## 7 నుంచి రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 5 : రాష్ట్రస్థాయి అండర్-15, అండర్-20 రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌ను ఈ నెల 7, 8 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంఏ హఫీజ్‌ఖాన్, మహ్మద్ కరీం తెలిపారు. హనుమకొండ జేఎన్ఎస్‌లో జరిగే ఈ పోటీల్లో అన్ని జిల్లాల క్రీడాకారులు పాల్గొంటారని చెప్పారు. విజేతలను ఈ నెల 11 నుంచి మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే తెలంగాణ జట్టుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

## ముల్కనూరు డెయిరీకి మూడోసారి ఐఎస్‌వో గుర్తింపు



డెయిరీ అధ్యక్షురాలు ధనశ్రీకి ఐఎస్‌వో గుర్తింపు పత్రాన్ని అందజేస్తున్న లీడ్ ఆడిటర్ రాంబాబు

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 5 : ముల్కనూరు మహిళా సహకార డెయిరీకి మూడో సారి ఐఎస్‌వో గుర్తింపు లభించింది. పాల సేకరణ మొదలుకొని పాల శీతలీకరణ, నిల్వ చేయడం, ప్రాసెసింగ్ (పాలు వేడి చేయడం, సజాతీయత, పాలను వేరు చేయడం, ప్రమాణీకరణ), ప్యాకింగ్, తయారీ విధానం, అమ్మకాలు, పాల ఉత్పత్తులు పెరుగు, బట్టర్ మిల్క్, పన్నీర్, నెయ్యి, స్వీట్లు తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. ముల్కనూరు మహిళా డెయిరీ నాణ్యతా ప్రమాణాలను కొనసాగించడం వల్ల మరో ఏడాది ఐఎస్‌వోను రెన్యువల్ చేసినట్లు లీడ్ ఆడిటర్ అడపాల రాంబాబు తెలిపారు. అనంతరం ముల్కనూరు మహిళా డెయిరీ అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ, జీఎం మారుపాటి భాస్కర్‌రెడ్డికి ఐఎస్‌వో సర్టిఫికెట్ అందజేశారు. ఐఎస్‌వో కన్సల్టెంట్ కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## కనకదుర్గ చిట్స్ మాజీ చైర్మన్, చైర్మన్‌పై కేసు నమోదు

సుబేదారి, ఫిబ్రవరి 5 : కనకదుర్గ చిట్‌ఫండ్ సంస్థ మాజీ ఉద్యోగి నల్లా భాస్కర్‌రెడ్డి ఆత్మహత్య కేసులో ఆ చిట్‌ఫండ్స్ మాజీ చైర్మన్ తిరుపతిరెడ్డి, అతడి అల్లుడు చిట్‌ఫండ్స్ చైర్మన్ కమలాకర్‌రెడ్డిపై ఆత్మహత్య ప్రేరేపణ కింద కేసు నమోదు చేసినట్లు సీఐ షుకూర్ తెలిపారు. ఆదివారం హనుమకొండలోని హరిత హోటల్‌లో భాస్కర్‌రెడ్డి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. హోటల్ గదిలో దొరికిన సూసైడ్ నోట్ ఆధారంగా పోలీసులు తిరుపతిరెడ్డి, అతడి అల్లుడు కమలాకర్‌రెడ్డి కేసు నమోదు చేశారు. ఈ మేరకు నోటీసులు కూడా జారీ చేసినట్లు సీఐ తెలిపారు.



గుడిమెలిగే పండుగ కోసం ముస్తాబైన సమ్మక్క పూజామందిరం

# రేపే గుడిమెలిగే పండుగ

## సిద్ధమవుతున్న పూజారులు

తాడ్వాయి, ఫిబ్రవరి 5 : మేడారం సమ్మక్క-సారలమ్మ పూజారులు బుధవారం గుడిమెలిగే పండుగ నిర్వహించనున్నారు. మహాజాతరకు రెండు వారాల ముందు ఈ పండుగ చేస్తారు. పూజారుల కుటుంబాలు ఇళ్లను శుద్ధి చేసుకొని సమ్మక్క గుడి వద్దకు చేరుకుంటారు. అత్యంత నియమ నిష్టలతో డోలివాయిద్యాల నడుమ సమీప అటవీ ప్రాంతానికి వెళ్లి గుట్ట గడ్డిని సేకరించి గుడిపై కప్పుతారు. అనంతరం గుడిలోని తల్లి గద్దెను ఎర్రమట్టితో అలుకు పూసి రంగురంగుల ముగ్గు లు వేసి అందంగా అలంకరిస్తారు. గుడిమెలిగే పండుగతో అమ్మవార్ల మహా జాతర ప్రారంభమైనట్లు పూజారులు భావిస్తారు. అప్పటి నుంచి సమ్మక్క-సారలమ్మ పూజారులు అత్యంత నియమనిష్టలు పాటిస్తారు. అనంతరం వచ్చే బుధవారం రోజున తిరిగి సమ్మక్క గుడిలో మండమెలిగే పండుగను నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అమ్మవార్ల పూజా సామగ్రిని శుద్ధి చేసి పూజలు ప్రారంభిస్తారు. మళ్లీ వచ్చే బుధవారం నుంచి మహా జాతరను ప్రారంభిస్తారు. జాతర అనంతరం వచ్చే బుధవారం పూజారులు తిరుగువారం పండుగను నిర్వహించి అమ్మవారి పూజా సామగ్రిని శుద్ధిచేసి తిరిగి గుడిలో భద్రపరుస్తారు. దీంతో మహా జాతర ముగిసినట్లు పూజారులు ప్రకటిస్తారు.

# నేటి నుంచి పలు రైలు రైళ్ల రద్దు

## కొన్నింటి ఫ్రీక్వెన్సీ కుదింపు

కాజీపేట, ఫిబ్రవరి 5 : కాజీపేట మీదుగా నడిచే పలు రైళ్లను ఈ నెల 6 నుంచి 11 వ తేదీ వరకు రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. సికింద్రాబాద్-మౌలాలి-చర్లపల్లి రైల్వే స్టేషన్ల మధ్య జరుగుతున్న మూడోలైన్ పనుల కారణంగా హైదరాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్-సికింద్రాబాద్ మధ్య నడిచే (17011/17012) ఇంటర్ సిటీ, సికింద్రాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్-సికింద్రాబాద్ మధ్య నడిచే (12757/12758) సిర్పూర్ కాగజ్‌నగర్ సూపర్‌ఫాస్ట్ రైలు, సికింద్రాబాద్-గుంటూర్-సికింద్రాబాద్ మధ్య నడిచే (12706/12705) ఇంటర్ సిటీ, విజయవాడ-సికింద్రాబాద్- విజయవాడ మధ్య నడిచే (12713/12714) శాతవాహన, సికింద్రాబాద్-భద్రాచలం రోడ్డు-సికింద్రాబాద్ మధ్య నడిచే(17659/17660) మణుగూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే సికింద్రాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్-సికింద్రాబాద్ మధ్య నడిచే (17233/17294) భాగ్యనగర్, సికింద్రాబాద్-గుంటూర్-సికింద్రాబాద్ మధ్య నడిచే (17201/17202) గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైళ్లను కాజీపేట వరకు కుదించినట్లు చెప్పారు.

